ప్రజాశక్తి
గురువారం 3 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం

ఎస్‌డిపి కార్యాలయాన్ని సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని ఎస్‌పి ఎస్.వి.మాధవ్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పెండింగ్లో ఉన్న కేసులు, ఎస్‌సి, ఎస్‌టి కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. ఆ కేసులు ఛేదించేందుకు దర్యాప్తులో తీసుకోవాల్సిన పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌డిపిఒ అంకిత సురాన, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డిపిఒతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

మన్యం జిల్లాలో మరణ మృదంగం

- 3 నెలల్లో ఐదుగురు విద్యార్థులు మృతి
- గిరిజన పాఠశాలలపై ప్రభుత్వం చిన్నచూపు

మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణ మృదంగం కొనసాగుతోంది. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలో మూడు నెలల్లో ఐదుగురు విద్యార్థులు అనారోగ్యంతో మరణించడం, అందులో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి సొంత జిల్లాలో విద్యార్థుల వరుస మరణాలు విస్మయానికి గురి చేస్తున్నాయి. గిరిజన పాఠశాలలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

అవంతిక (ఫైల్)

శారద (ఫైల్)

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గడిచిన మూడు నెలల్లో ఐదుగురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. గడచిన రెండు రోజుల్లోనే పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు పరిధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కొమరాడ మండల కేంద్రంలో ఉన్న కెజిబివిలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి కద్రక శారద డెంగీ జ్వరంతో చికిత్స పొందుతూ విశాఖ కెజిహెచ్‌లో మరణించింది. జిల్లా కేంద్రంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లినా శారద ఆరోగ్యం మెరుగు పడలేదు. దీంతో పాఠశాల సిబ్బంది కెజిహెచ్‌కి తరలించారు. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అవంతిక కూడా డెంగీతో మృతి చెందింది. అంతకుముందు జులై నెలలో ముగ్గురు విద్యార్థులు అనారోగ్యంతో మరణించారు. జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి బి.ఈశ్వరరావు జులై 6న మృతి చెందాడు. అదే నెలలో సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో మూడో తరగతి విద్యార్థిని బి.రిష్మిత మరణించింది. జులై 22న పార్వతీపురం మండలం రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి పి.రాఘవ అనారోగ్యంతో మృతి చెందాడు. గిరిజన సంక్షేమమే ధ్యేయంగా పని చేయాల్సిన ఐటిడిఎ ప్రాజెక్టులకు సరిపడా నిధులు మంజూరు కాకపోవడం, రెగ్యులర్ పిఒలు లేకపోవడంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై తగిన పర్యవేక్షణ కొరవడుతోంది. దీని కారణంగా విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

జ్వరంతో విద్యార్థిని మృతి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నిమ్మల అవంతిక అనే గిరిజన విద్యార్థిని జ్వరంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. విద్యార్థిని స్వగ్రామం మండలంలోని కె.శివడ. అవంతిక అనారోగ్యానికి గురవడంతో వైద్యం కోసం పార్వతీపురం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. తమ బిడ్డ అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు రోదిస్తున్నారు.

తొలి సంతకం అమలేది?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం చేశారు. కానీ ఇంతవరకు గిరిజన పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకానికి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ పాఠశాలల డైట్ బిల్లు లు కూడా సకాలంలో మంజూరు కావడం లేదు. విద్యార్థులు అనారోగ్యానికి గురైనప్పుడు వారిని సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధిత పాఠశాల హెచ్‌ఎం లేదా వార్డెన్ తీసుకెళ్ళాలి. వారికి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసే పరిజ్ఞానం ఉండకపోవచ్చు. పాఠశాలలో అందుబాటులో ఉన్న మందులను వినియోగించడం ద్వారా ప్రాథమిక చికిత్స అందించవచ్చు. ఈవిధమైన చర్యలు తీసుకోవడంలో పాఠశాల హెచ్‌ఎం లేదా వార్డెన్‌కు పని ఒత్తిడి వల్ల కొంత జాప్యం జరిగితే విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు విషమించే అవకాశం ఉంటుంది. అదే పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం చేపడితే విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసే పరిజ్ఞానం వారికి ఉంటుంది. వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది ఎఎన్‌ఎంలకు అవగాహన ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలోనూ ఎఎన్‌ఎంల నియామకం చేపట్టలేదు. ప్రస్తుతం ప్రభుత్వ హయాంలోనైనా జరుగుతుందనే ఆశ కనుచూపు మేరలో కనిపించడం లేదు.

పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలి : సిపిఎం

కొమరాడ : మండలంలో కెజిబివిలో 9వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి శారద మృతిపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యార్థుల మరణాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోవడం దారుణమన్నారు. అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే గిరిజన విద్యార్థి మృతి చెందిందని ఆవేదన వ్యక్తంచేశారు. శారద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. భవిష్యత్తులో గిరిజన విద్యార్థుల మరణాలను అరికట్టే విధంగా ప్రభుత్వం ముందుచూపుతో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్నో ఆశలతో చేర్పిస్తే..

తమ పిల్లలు చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనే ఉద్దేశంతో గిరి జనులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేరుస్తున్నారు. ఐదో తరగతి వరకు దగ్గరలో ఉన్న పాఠశాలల్లోనే చదివించుకుని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తమ సొంత పిల్లల్లా చూసుకుంటారనే నమ్మకంతో పిల్లలను వదిలి వెళ తుంటారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదు పాయాల సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. చాలా పాఠశాలల్లో రక్షిత మంచినీటి సరఫరా చేసే ఆర్ఒ ప్లాంట్లు పని చేయడం లేదు. దోమల బారినుండి కాపాడే దోమతెరలను ఇంతవరకు పంపిణీ చేయలేదు. మూడేళ్ల క్రితం పంపిణీ చేసిన దోమ తెరలు చిరిగిపోయాయి. ఎఎన్‌ఎంల నియామకం నుంచి దోమతెరల పంపిణీ వరకు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బాధితులకు పరిహారం చెల్లించాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ మృతి చెందిన విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై మంత్రి సంతకం చేసి మూడు నెలలు దాటిందని, ఇంతవరకు నియామకం లేదని చెప్పారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ పాపం ప్రభుత్వానిదే

కొమరాడ : మన్యం జిల్లాలో రెండు రోజుల్లో ఇద్దరు గిరిజన విద్యార్థులు మృతి చెందారని, ఈ పాపం ప్రభుత్వానిదేనని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పళ్ల సురేష్ ఆక్షేపించారు. కొమరాడలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మంగళవారం కొమరాడ కెజిబివి విద్యార్థి కద్రక శారద, బుధవారం గుమ్మలక్ష్మీ పురం మండలం పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న నిమ్మల అవంతిక డెంగీతో మృతి చెందారని తెలిపారు. నిత్యం జిల్లాలో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్

ఆదర్శం.. మహాత్ముని జీవితం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వేరెవరో పరిరక్షించరని, మనకు మనమే వాటిని కాపాడుకోవాలని జాతిపిత గాంధీ చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకమని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. అందుకే మహాత్ముని జీవితం అందరికీ ఆదర్శమన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని తహశీల్దారు కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యం, అహింస మార్గంలో ఉద్యమించి, బానిస సంకెళ్ల తెంచి, బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించిన మహాత్ముడి బోధనలు నేటికీ ఆదర్శనీయం, అనుసరణీయమని చెప్పారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఈ నెల 5వ తేదీన మహిళా రక్షణ అవగాహన కార్యక్రమాన్ని సాలూరులో నిర్వహిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, భీమారావు, పరమేశ్, శ్యామ్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు, మున్సిపల్ ఉపాధ్యాయులు

మున్సిపల్ ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గాంధీ విగ్రహం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. హైస్కూల్లో అన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. అర్బన్ ఎంఇఒ పోస్టులను కేటాయించాలని, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ ఈ నెల 17న డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.భాస్కరరావు, ఎన్.శ్రీను, ఎస్.జానకిరావు, ఎం.పైడిరాజు, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యకాస, గిరిజన సంఘం నాయకులు

నకిలీ విత్తనాలతో తీవ్ర నష్టం

- గిరిజనులను మోసగించిన వారిపై కేసులు పెట్టాలి
- ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-మక్కువ

నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని మోసగించిన వారిపై కేసులు పెట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మక్కువ మండలం నంద గ్రామంలో 15 మంది గిరిజన రైతుల వేసిన నకిలీ విత్తనాలతో పాడైన మొక్కజొన్న పంటను బుధవారం వారు పరిశీలించారు ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ మక్కువలో గ్రంధి గున్నరాజు, కొంచాడ శ్రీనివాసరావు వ్యాపారుల వద్ద అడ్వెంట్ 9293 కంపెనీ మొక్కజొన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేసి, సుమారు 30 ఎకరాల్లో నాటారని తెలిపారు. విత్తనం నాటిన తరువాత ఎదుగుదల మందగించి, పూర్తిగా వెన్ను రాలేదని చెప్పారు. పంట చేతికి వచ్చే సమయానికి గిడస బారిపోయి నాశనం అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. విత్తనం నకిలీది కావడం వల్ల పూర్తిగా పంట పాడైందని మండల వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమాయక గిరిజన రైతులను వ్యాపారులు మోసగించారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నకిలీ విత్తనాలతో గిరిజనులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ75 వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బాధిత గిరిజన రైతులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయని, జిల్లా వైద్యాధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, వి.వాసు , అంగధ డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. జ్వరాలతో బాధపడుతూ మొండెంఖల్, నీలకంఠపురం ఆసుపత్రులకు వెళ్తే కనీసం వైద్య పరీక్షలు కూడా నిర్వహించకుండా, మందులు రాసిచ్చి ప్రయివేటు దుకాణాల్లో తీసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. గిరిజనుల ప్రాణాలంటే వైద్య సిబ్బందికి లెక్క లేదా ? అని ప్రశ్నించారు. తప్పని పరిస్థితుల్లో గిరిజనులు ఆర్‌ఎంపిలను ఆశ్రయించి రక్త పరీక్షలు చేసి, రూ.వేలల్లో ఖర్చుచేసి, ఆర్థికంగా, ఆరోగ్యంగా చితికి పోతున్నారని తెలిపారు. వెంటనే పిహెచ్‌సిల్లో జ్వరాలకు మందులు అందుబాటులో ఉంచి, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, దోమతెరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘం

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజలకు సేవలందించడంలో, ఆరోగ్యాలను కాపాడడంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అమోఘమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ శాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో చక్కని పనితీరు కనబరిచిన పంచాయతీలకు, గ్రీన్ అంబాసిడర్లను అభినందిస్తూ సన్మానాలు చేసి, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమం అమల్లో రాష్ట్రంలో మన్యం జిల్లా నాలుగో స్థానం పొందిందన్నారు. ప్రజలు ఇంటి నుండి అందించే చెత్తను తడి,పొడి చెత్తగా విడదీసి ఇవ్వాలని సూచించారు. తడి చెత్తతో వర్మికంపోస్టు తయారీకి, పొడి చెత్తను తిరిగి వినియోగించుకొనే వస్తువులు తయారీకి ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

సీతంపేట కార్యదర్శి సుదర్శనరావుకు ఉత్తమ కార్యదర్శి అవార్డును అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డిఆర్ఒ జి.కేశవనాయుడు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతాలను ఆచరిస్తున్న 'జట్టు'

పార్వతీపురం టౌన్ : పరిసరాలు శుభ్రంగా ఉంటే మన ఆలోచనలు కూడా మంచిగా ఉంటాయనే గాంధీ సిద్ధాంతాలను జట్టు ఫౌండేషన్ ఆచరణలో చూపిస్తోందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణ శివారులో ఉన్న జట్టు ఆశ్రమంలో నిర్వహించిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని నూరు శాతం జట్టు ఫౌండేషను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జట్టు ఆశ్రమ వ్యవస్థాపకులు వి.పద్మజమ్మ, నాబార్డు డిడిఎం దిలీప్, డి.పారినాయుడు, సిహెచ్ పారునాయుడు, ఎ.కైలాసరావు, ఎ.ఈశ్వరరావు, ఎన్.హేమంత్, పవన్, యశ్వంత్, హరి పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సందడి

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో ఉన్న కోటదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ కూడా అన్నదానం పెట్టేందుకు ఉత్సవ కమిటీ చర్యలు తీసుకుంది. ఇప్పటికే అనేక మంది దాతలు ముందుకొచ్చారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పల్లా కొండలరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్‌తోపాటు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ ఇప్పటికే ఈ ఉత్సవాలకు నిధులు కేటాయించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఫోన్ ద్వారా కోరారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి సూర్యనారాయణ, ప్రధాన అర్చకులు దారలపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. డిఎస్‌పి ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సిఐ చంద్రమౌళి పర్యవేక్షణలో ఆలయం వద్ద గట్టి బందోబస్తు చేపట్టనున్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలకు ఆహ్వాన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

నవంబరు మూడో తేదిన నిర్వహించే యుటిఎఫ్ స్వర్ణోత్సవాల కోసం ఆహ్వాన కమిటీ ఏర్పాటుచేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, కన్వీనర్‌గా ఎస్.మురళీమోహనరావు, కోశాధికారి కె.మురళి, చీఫ్ ప్యాట్రన్‌గా జి.వి.ఆర్ కిషోర్, జి.శ్రీరాములు, జి.జగన్నాథం, వై.మన్మథరావు నియమితులయ్యారు.

6 వాహనాల్లో 36 పశువుల తరలింపు

స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి-కొమరాడ

ఒడిశా నుంచి పార్వతీపురం వైపు అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. బుధవారం ఒడిశా నుంచి పార్వతీపురం వైపు ఆరు బొలెరో వాహనాల్లో 36 పశువులను తరలిస్తున్నారు. మితిమీరిన పశువులను రవాణా చేస్తూ పట్టుబడటంతో వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. 36 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పశువులను తరలిస్తున్న ఆరు బొలెరో వాహనాలతోపాటు యజమానులపైనా కేసులను నమోదు చేశామని చెప్పారు.

బొలెరో వాహనంలో కిక్కిరిసి ఉన్న మూగజీవాలు

నూతన మద్యం పాలసీపై నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా మహిళా సంఘాల ఐక్యవేదిక, సిఐటియు ఆధ్వర్యాన బుధవారం పట్టణంలో నాలుగురోడ్ల కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి వినతి అందించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఐద్వా నాయకులు సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తోందని మండిపడ్డారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేసి ప్రజల ఆరోగ్యంతో మద్యం చెలగాటమాడుతుందని, ఈ రకమైన మద్యం విధానాన్ని ప్రభుత్వం నియంత్రించాలని డిమాండ్ చేశారు. బడి, గుడి, జనవాసాల మధ్య మద్యం షాపులు పెట్టరాదన్న నిబంధన ఉన్నా యదేచ్ఛగా షాపులకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం మద్యం నియంత్రించాలని, మద్యం బారిన పడే చనిపోయిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, సాయి లక్ష్మి, భాగ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతి ఇస్తున్న గిరిజనులు

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

బాలేసు పంచాయతీ జయ్యాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి బుధవారం వినతి పత్రం అందించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందడం లేదని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. సమస్యను విన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తానని హామీనిచ్చారు.

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ఎస్ వి‌ఆర్ఎం రాజు

పలగరలో గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో పలగర గ్రామంలో బుధవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. భగత్‌సింగ్, అంబేద్కర్, సుందరయ్య పేరిట ఏర్పాటుచేసిన ఈ గ్రంథాలయాన్ని సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ఎస్‌వి ఆర్ఎం రాజు ప్రారంభించారు. గ్రంథాలయ నిర్వాహకులుగా అజయ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లును వెంటనే తెరిపించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహాత్మా మీరైనా స్థానిక జ్యూట్ మిల్‌ను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. బుధవారం జరజాపుపేట గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 4 నెలలుగా స్థానిక జ్యూట్‌మిల్ ముడి సరుకు కొరత పేరిట యాజమాన్యం మూసి వేసిందన్నారు. మిల్లు మూత బడడం వల్ల కార్మికులు ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కి ప్రజా సంఘాల తరుపున విన్నవించుకున్నప్పటికీ నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి మూతబడిన జ్యూట్‌మిల్‌ను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనకల పద్మనాభం, కార్మికులు గాడు అప్పారావు, హెచ్చర్ల అప్పారావు, తుమ్మ తాత, మద్దిల సన్యాసిరావు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలను అడ్డుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

బిజెపి దేశంలోని అన్ని రాష్ట్రాలలో మతతత్వ రాజకీయాలను అవలంబిస్తుందని దీన్ని కచ్చితంగా అడ్డుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ గేదెల తిరుపతి అన్నారు బిజెపి అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం పట్టణంలోని దేవి కూడలిలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి మెమరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాదాల మణి బాబు, అనుమాల శెట్టి నానాజీ, జామి మండల సీనియర్ నాయకులు లెక్కల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 22 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో 2020లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడైన పాత బొబ్బిలి, ప్రసాద్ నగర్‌కు చెందిన డొంకాడ రమేష్‌కు విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎన్.పద్మావతి 22 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమాన విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. పాత బొబ్బిలి ప్రసాద్ నగర్ కాలనీకి చెందిన నిందితుడు డొంకాడ రమేష్ (44) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఒకామెపై ఇంటిలో ఒంటరిగా ఉన్న సమ యంలో అత్యాచారానికి పాల్పడినట్లుగా వచ్చిన ఫిర్యాదుతో బొబ్బిలి పోలీసు స్టేషనులో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నింది తుడు డొంకాడ రమేష్ ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లుగా నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు వెలువడిందని ఎస్‌పి ఒక ప్రకటనలో తెలిపారు

సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలో సోషల్ మీడియా టిడిపి యాప్‌లో ప్రతిభ కనబరిచిన ఐదుగురికి మంత్రి నారా లోకేష్ గుర్తించి ఇచ్చిన ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అందించారు. సుకేష్ చంద్ర పండా (కురుపాం), ముంజి హరీష్, అధికారి సంతోషి కుమారి(కొమరాడ), మరడాన రామారావు (గరుగుబిల్లి), పట్లాసింగి అనిల్ (గుమ్మలక్ష్మీపురం)కి వాటిని అందజేశారు.

వరద బాధితులకు సహాయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విజయవాడ వరద బాధితుల కోసం గుమ్మలక్ష్మీపురంలోని సరస్వతి విద్యానికేతన్ కరస్పాండెంట్ విమల.. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి రూ.10 వేలు విరాళం అందజేశారు.

కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి- భామిని

భామిని గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రివేళల్లో ఒంటరిగా ఎవరైనా బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో పిల్లలు గ్రామాల్లోని వీధుల్లో ఆడుకుంటూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో వీధి కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయేమోనని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల్ని తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

వీధుల్లో సంచరిస్తున్న కుక్కల గుంపు

గాంధీ స్ఫూర్తితో సమాజసేవలో భాగస్వామ్యం

మహాత్ముని జయంతి వేడుకల్లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ • జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులు

పార్వతీపురం.. గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంచిపల్లి శ్రీరాములు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

గాంధీ మహాత్ముని ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్ఎన్ఎం నగర్‌లో ఉన్న పార్కులో చేపట్టిన శ్రమదానంలో కలెక్టర్‌తోపాటు సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాత్సవ, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. పార్కులో మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. పార్కు నుంచి మెయిన్ రోడ్డు వరకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పార్కును శుభ్రం చేసేందుకు స్థానికులతో కలిసి సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. పార్కు నిర్వహణ బాధ్యతను స్థానిక కమిటీ తీసుకోవాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి అందించాలని తెలిపారు. నియోజకవర్గం మొత్తాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకారంతో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గాంధీ స్ఫూర్తితో నవసంకల్పం

పార్వతీపురంరూరల్ : గాంధీ స్ఫూర్తితో నవ సంకల్పం తీసుకోవాలని ఎస్‌పి ఎస్.వి.మాధవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాపూ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్, ఆర్ఐ శ్రీరాములు, శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఎస్ఐ వి.పాపారావు, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉన్న బాపూజీ విగ్రహానికి ఎంపిపి మజ్జి శోభారాణి, తాళ్ల బురిడిలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి రెవెన్యూ సిబ్బంది, సంస్కృత ఉన్నత పాఠశాలలో సాహితీ లహరి వ్యవస్థాపకులు మంచిపల్లి శ్రీరాములు నివాళులర్పించారు.

పార్వతీపురం : ఐటిడిఎ, సబ్ కలెక్టర్ కార్యాలయాలలో గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్, ఐటిడిఎ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ సభ్యులు బి.అప్పలనరసయ్య, జిల్లా కోఆర్డినేటర్ యమ్మల జనార్ధనరావు పాల్గొన్నారు. భాస్కర్ కళాశాలలో చైర్మన్ చుక్క భాస్కరరావు, డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.రవిశాస్త్రి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు : పట్టణంలోని శ్రీవెంకట విద్యాగిరి పాఠశాలలో గాంధీ విగ్రహానికి కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు ప్రాణదాత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వి.గణేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోడూరు లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని బాగువలస ప్రాథమిక పాఠశాలలో గాంధీ విగ్రహానికి హెచ్‌ఎం రాజమణి నివాళులర్పించారు.

కురుపాం : సరస్వతి విద్యానికేతన్ సిబ్బంది, విద్యార్థులు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గాంధీజి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం.రవణమ్మ గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత.. గాంధీజీ విగ్రహానికి పూలమాలనేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశలత, డాక్టర్ సుకృత, కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి నాయుడు, టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐ.రామకృష్ణ ,విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరాడ : విక్రంపురం సచివాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకట్‌నాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కలింగ మల్లిబాబు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎఎఒ విజయరాణి, డిప్యూటీ డిఇఒ నారాయుడు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహానికి తహశీల్దార్ జి.రాములమ్మ, ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్.రామారావు, వైసిపి నాయకులు ఆర్‌వి పార్థసారథి పూలమాల వేసి నివాళు లర్పించారు. పెదబోగిలి పంచాయతీ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా జిల్లా అధ్యక్షులు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ నివాళులర్పించారు. గాంధీ విగ్రహానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, ఎస్.మురళీమోహన్ నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు మండల గౌరవాధ్యక్షులు టి. మధుసూదనరావు, నాయకులు ఎం.గోవిందరావు, బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లి, గొట్టివలస గ్రామాల్లో గాంధీ విగ్రహానికి జట్టు ట్రస్టు నిర్వాహకులు డి.పారినాయుడు, సిఆర్‌పి బోను రామకృష్ణ నివాళు లర్పించారు. కార్యక్రమంలో జట్టు సిబ్బంది మార్కొండ నూకంనాయుడు, గొళ్ల మురళీ మోహన్, మరడాన గౌరీ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బొమ్మాల భాను, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్. ఎం. మీసాల సూర్యనారాయణ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజలు తమ హక్కులను స్వేచ్ఛగా పొందుతున్నారంటే అది కచ్చితంగా స్వాతంత్ర్య సమరయోధుల ఫలితమేనని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాంధీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి లక్ష్మణరావు, నాయకులు దాసు, చిన్న, సీతారాం, రామారావు, పురుషోత్తం, లోవరాజు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా, మండల కార్యదర్శులు ఎం.పైడిరాజు, కె.గోవిందరావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యం నాయుడు, సీనియర్, జూనియర్ సహాయకులు ఎం.నాగభూషణ, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలో పలుచోట్ల మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు, గ్రామ పెద్దలు ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పార్వతీపురంటౌన్.. మొక్క నాటుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే

కురుపాం.. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు

పార్వతీపురంరూరల్.. గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపిపి, నాయకులు

సీతానగరం.. గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, నాయకులు

గాంధీ కలలు కన్న స్వరాజ్యానికి తూట్లు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలని గతంలో వైసిపి ప్రభుత్వం సంకల్పిస్తే, దానికి తూట్లు పొడిచేలా టిడిపి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచే చర్యలు చేపట్టిందని చెప్పారు. మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. అందులో సర్పంచుల ప్రాధాన్యత తగ్గించేందుకు కుటిల రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వాలంటీర్ల వ్యవస్థకి మంగళం పాడిందన్నారు. సచివాలయ వ్యవస్థ కూడా గందరగోళంలో పడిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్ మోహన్ రావు, మాజీ కౌన్సిలర్లు పిరిడి రామకృష్ణ, ఎం.అప్పారావు, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, పాచిపెంట చినబాబు, మువ్వల ఆదియ్య పాల్గొన్నారు.

పనుల గుర్తింపుపై గ్రామసభలు

వీరఘట్టం.. గ్రామసభలో మాట్లాడుతున్న ఎపిఒ సత్యంనాయుడు

ప్రజాశక్తి-వీరఘట్టం

పంచాయతీలో ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎపిఒ జి.సత్యంనాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పురంలో గ్రామసభ ఏర్పాటుచేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి జె.షణ్ముఖరావు, గ్రామ నాయకులు టి.సుందరరావు, కె.హరి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురంలో సర్పంచి చెరుకుపల్లి బంగారమ్మ, చినబొండపల్లిలో సర్పంచ్ గండి శంకరరావు ఆధ్వర్యాన గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ, 15 ఆర్థిక సంఘం నిధుల పనుల పరిస్థితి సమీక్షించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై చర్చించి తీసుకున్న నిర్ణయాలను గ్రామసభలో ఆమోదించారు. ఈ కార్యక్రమాల్లో డిఎల్‌పిఒ నాగభూషణరావు, ఎంపిడిఒ రమణమూర్తి, ఎంపిపి శోభారాణి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భామిని : ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు చేపడుతూ, గ్రామాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని డిఎల్‌డిఒ గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని భామిని, గణసర, బాలేరు గ్రామాలలో ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్రరావు, ఎపిఒ తులసీదాస్, ఇఒపిఆర్‌డి కృష్ణారావు, సర్పంచులు లోపింటి రాజేశ్వరి, కిల్లారి ఫాల్గుణరావు, టిడిపి నాయకులు బిడ్డికి ప్రసాద్, లోపింటి రాజేష్, పంచాయతీ కార్యదర్శి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పోలీస్ శాఖలో ఉంటూ హెచ్‌సి కె.కృష్ణమూర్తి చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, వృద్ధమిత్ర కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ పేదలకు సేవలందిస్తున్న కృష్ణమూర్తిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బార్నాల సీతారాం , బెలగాం జయబాబు, కోరాడ నారాయణరావు, వై.నిర్మల కుమారి, గుంట్రెడ్డి రవి పాల్గొన్నారు.


హెచ్‌సి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ఇ-పంట నమోదు పూర్తి

ప్రజాశక్తి-పాచిపెంట

ఖరీఫ్ సీజన్లో మండలంలో ఇ- పంటల నమోదు నూరు శాతం పూర్తయిందని ఎఒ కె.తిరుపతిరావు తెలిపారు. రైతుల ఇ-కెవైసి 96 శాతం అయిందని, రెండు మూడు రోజుల్లో నూరు శాతం పూర్తవుతుందని చెప్పారు. మండలంలోని మాతమూరు, గురువునాయుడుపేట, తాడూరు గ్రామాలలో ఇ-పంట నమోదు సరిగ్గా జరిగిందా? లేదా? అని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మిగిలిన రైతులంతా ఇ-కెవైసి చేసుకోవాలని, ఎక్కడైనా ఏమైనా తప్పులు దొర్లితే వ్యవసాయ శాఖ దృష్టికి తేవాలని సూచించారు. ఏడో తేదీలోగా వాటిని సరి చేస్తామన్నారు. అనంతరం రైతుల ఫోన్ నంబర్లకు సంక్షిప్త సమాచారాలు పంపించడమే కాకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ఇ- పంట రశీదులు కూడా అందిస్తారని చెప్పారు. పంటల కొనుగోళ్లకు, పంటల బీమా, నష్టపరిహారాలకు, కౌలు రైతులకు పంట రుణాలకు ఇ-పంట నమోదు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. రైతులు కూడా సహకరిస్తే తొందరగా పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేస్తున్న ఎఒ తిరుపతిరావు

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని ప్రకృతి వ్యవసాయం ఎస్ఆర్‌పి పి.దేవుళ్లు తెలిపారు. బుధవారం మండలంలోని నందివానివలసలో చిట్టపల్లి పొలన్నదొర పొలంలో శ్రీరాగి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం రాగికి కిలో రూ.40 మద్దతుధర ప్రకటించిందని తెలిపారు. రైతులకు పెట్టుబడులు తగ్గి, ఆదాయం అధిక మొత్తంలో వస్తుందని తెలిపారు. పురుగులు, తెగుళ్లను తట్టుకునే శక్తి కలిగి ఉంటాయిని చెప్పారు. నేటి పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. సంపూర్ణ పోషకాలు చిరుధాన్యాలతో సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, కామేష్, రైతులు శ్రీధర్, శ్రీకాంత్, హరిక్రిష్ణ, సరోజినీ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగును పరిశీలిస్తున్న ఎస్ఆర్‌పి దేవుళ్లు